క్లుప్తంగా

26న చతుర్వేద సభ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నవంబర్ 26న రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు చతుర్వేద సభ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కిషోర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసభకు పలువురు వేదపండితులు హాజరవుతారని ఆయన వివరించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి వారి దత్తత ఆలయమైన మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వెంకటేశ్వరరావు స్వామివారికి లక్ష బిల్వార్చన, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ఈవో వరప్రసాద్, భక్తులు పాల్గొన్నారు. వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నందిగామ మండలం జొన్నలగడ్డకు చెందిన కొండవీటి నిఖిత్ రూ.20,521లను విరాళంగా అందజేసినట్లు ఈవోకు తెలిపారు.

న్యాయవాదుల నిరసన



నందిగామటౌన్: విశాఖపట్నంలోని న్యాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిపై గ్యాంగ్ రేప్, తమిళనాడులో సీనియర్ న్యాయవాది కన్నా హత్య ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్ పేర్కొన్నారు. ఈ ఘటనలను తీవ్రంగా ఖండిస్తూ స్థానిక కోర్టు ఆవరణలో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు తక్షణమే స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు అద్దంకి మణిబాబు, హనుమంతరావు, ప్రకాష్, భాస్కరరావు, ప్రపోజిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వత్సవాయి: మండలంలోని మంగొల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఇందుగపల్లి ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నమోదుగపల్లి, పెద్దమోదుగపల్లి, రామచంద్రాపురం, ఇందుగపల్లి, కన్నెవీడు, చిట్టేల, శింగవరం, మక్కపేట గ్రామాల్లోని ఎక్స్‌ప్రెస్ లైన్‌లో ఉదయ ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌సరఫరా నిలిచిపోతుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మండలంలోని కీసర విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 8.30గంల నుంచి మధ్యాహ్నం 12గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దిబ్బయ్య శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గండేపల్లి, కీసర, పెండ్యాల, వేములపల్లి, శౌరీ అమరవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా జగ్గయ్యపేట పట్టణంలోని ఆయా ప్రాంతాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ జె.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని విలియంపేట, ముక్త్యాల బస్టాండ్, పెద్ద రామాలయం, ఆకులవారి వీధి, అద్దాలబజారు, రంగస్వామి బజారు, కాగితాల బజారు, శివాలయం వీధి, నాగమయ్య బజారు, రజక బజారు, నాయీబ్రాహ్మణ బజారు, బ్రాహ్మణబజారు, యానాది కాలనీ, మఠం శివాలయం, వైవై కాలనీ, కాకానినగర్, తొర్రగుంటపాలెం, విద్యానగర్, ధనంబోడు కాలనీ, చిల్లకల్లు ప్రధాన వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని డీఈఈ కోరారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపు

చందర్లపాడు(నందిగామటౌన్):చందర్లపాడు మండలంలోని గుడిమెట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. 2025–26 చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులను గుర్తించారు. ఈసందర్భంగా ఏపీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికి నూరుశాతం పని దినాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

గాడి తప్పిన తాగునీటి సరఫరా

- అస్తవ్యస్తంగా పేట హెడ్ వాటర్‌వర్క్స్
- మరమ్మతులకు నోచుకోని స్టాండ్‌బై మోటార్లు
- ప్రజలకు అరకొరగానే తాగునీరు
- కాలిపోయిన జనరేటర్
- అద్దె జనరేటర్లతో మున్సిపాలిటీపై నెలకి రూ.3 లక్షల భారం



పేట పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే పంప్‌హౌస్

జగ్గయ్యపేట అర్బన్: వాటర్ హెడ్‌వర్క్స్ సిబ్బంది నిర్లక్ష్యం..మున్సిపల్ అధికారుల బాధ్యత రాహిత్యం. మున్సిపల్ చైర్మన్ పర్యవేక్షణలోపం జగ్గయ్యపేట పట్టణంలో తాగునీటి సరఫరాకు శాపంగా మారింది. ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేందుకు హెడ్ వాటర్‌వర్క్స్‌లో ఏర్పాటు చేసిన మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో నీటిసరఫరాలో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో తాగునీరు అందక జగ్గయ్యపేట వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ పాలకులు కుళాయి బిల్లుల వసూళ్లలో చూపే శ్రద్ధను తాగునీటిని సరఫరా చేయడంలో చూపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్టాండ్ బై మోటార్లు లేవు..

కృష్ణాజలాలు, పాలేటి నీటిని ఫిల్టర్‌ట్యాంకు, క్లోరినేషన్ తదితర ప్రక్రియల ద్వారా శుద్ధి చేసిన తరువాత వాటిని వెల్‌లోకి లేదా సంపులోకి పంపుతారు. అక్కడ్నుంచి మోటార్లు నీటిని తోడి పైపు లైన్‌ల ద్వారా పట్టణంలోని రిజర్వాయర్లకు పంపించాల్సి ఉంది. అయితే హెడ్‌వాటర్ వర్క్స్ లో ప్రధానంగా పనిచేసే ఈ 60 హెచ్‌పీ మోటార్, 40 హెచ్‌పీ మోటార్లకు ప్రత్యామ్నాయంగా స్టాండ్‌బై



వరదల కారణంగా పంప్‌హౌస్‌లో పేరుకుపోయిన మట్టి

మోటార్లు అందుబాటులో లేవు. దీంతో మోటార్లు రిపేర్ల సమయంలో నీటిసరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పంప్‌హౌస్‌లో 60 హెచ్‌పీ మోటారు మరమ్మతులకు గురైతే దానికి బదులుగా స్టాండ్‌బై మోటారు లేదు. 40 హెచ్‌పీ మోటారుకు ఉన్న స్టాండ్ బై మోటార్ మరమ్మతుల నిమిత్త నాలుగునెలలుగా కోదాడలోనే ఉంది. రెండు రోజుల కిందటే ఈ స్టాండ్‌బై మోటార్‌ను హెడ్‌వాటర్ వర్క్స్‌లో ఏర్పాటు చేశారు. అదేవిధంగా క్లోరినేషన్‌కు సంబంధించి స్టాండ్ బై సిలిండర్ లేకపోవడంతో క్లోరిన్ గ్యాస్ అయిపోయినపుడు ఫిల్లింగ్ కోసం మూడు నాలుగు రోజులు పడుతోంది. ఈ సమయంలో క్లోరినేషన్ చేయకుండానే ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇటీవల క్లోరిన్ గ్యాస్ ట్యాంకు లీకవడంతో అక్కడ పనిచేస్తే వ్యక్తి అనారోగ్యం పాలయ్యారు.

షార్ట్ సర్క్యూట్‌తో జనరేటర్ దగ్ధం..

హెడ్ వాటర్‌వర్క్స్‌లోని 160 కేవీ జనరేటర్ ఈనెల 14న షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. దీంతో నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దగ్ధమైన జనరేటర్ స్థానంలో కొత్త జనరేటర్‌ను కొనుగోలు చేయాలంటే రూ.26 లక్షలు వెచ్చించాల్సిందే. ఈక్రమంలో మున్సిపల్ పాలకులు రోజుకు రూ.10వేలు అద్దె చెల్లించేలా రెండు జనరేటర్లను ఏర్పాటు చేయడం గమనార్హం. అదేవిధంగా రెండు నెలల కిందట సంభవించిన వరదలకు పంప్‌హౌస్‌లోని ఆయా విభాగాలు నీటిలో మునిపోయాయి. యంత్ర సామగ్రి మధ్య రెండు అడుగుల మేర మట్టి పేరుకుపోయింది. ఆ మట్టిని పూర్తిస్థాయిలో తొలగించకుండా వదిలివేయడంతో మిషనరీ సజావుగా పనిచేయడం లేదు.

లోపాలు సరిచేయాలి..



60వేల మందికి పైగా ఉన్న జగ్గయ్యపేట ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే పంప్‌హౌస్‌లో ఎటువంటి లోపాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలిపోయిన జనరేటర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలి. 60 హెచ్‌పీ మోటారుకు ప్రత్యామ్నాయంగా మరొకటి సిద్ధంగా ఉంచాలి.

–గుంజ హుస్సేన్, మిట్టగూడెం

సమస్యను పరిష్కరిస్తాం..



మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తీర్థయాత్రలకు వెళ్లారు. ఆయన జగ్గయ్యపేట రాగానే పంప్‌హౌస్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలిస్తాం. కౌన్సిల్ సభ్యులు, అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం.

–ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్

నీటి అవస్థల్లో జనం..తీర్థయాత్రల్లో చైర్మన్...

మున్సిపాలిటీకి సంబంధించి కీలకమైన తాగునీటి సరఫరా వ్యవహారం ఇంత గందరగోళ పరిస్థితికి చేరినప్పటికీ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు పట్టణ ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. సుమారు 60 వేల జనాభా కలిగిన జగ్గయ్యపేట పట్టణంలో తాగునీటి సరఫరాలో తరచూ అవాంతరాలు ఏర్పడుతుంటే వ్యవస్థను గాడిలో పెట్టేందుకు యత్నించకుండా మున్సిపల్ చైర్మన్ తీర్థయాత్రలకు వెళ్లడమేమిటని పెదవి విరుస్తున్నారు. హెడ్‌వాటర్ వర్క్స్ పనితీరు, తాగునీటి సరఫరా విషయంలో మున్సిపల్ చైర్మన్ దృష్టి సారించకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య స్పందించి తాగునీటి సరఫరాను గాడిలో పెట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఇటీవల కాలిపోయి నిరుపయోగంగా మారిన జనరేటర్



పంప్‌హౌస్‌లో స్టాండ్‌బై లేకుండా ఉన్న 60 హెచ్‌పీ మోటార్

మంత్రి సత్యకుమార్ క్షమాపణలు చెప్పాలి : తన్నీరు

జగ్గయ్యపేటఅర్బన్: ముస్లింల మనోభావాలను కించపరిచేలా చారిత్రక హజ్‌యాత్రపై శాసనమండలిలో ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ మాట్లాడటం తగదని, మంత్రి వెంటనే ముస్లింలకు క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కోదాడ రోడ్‌లోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ముస్లింమైనార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద ఎలుకలను తిన్న పిల్లి హజ్‌యాత్రకు వెళ్లి వచ్చిందంటూ మంత్రి సత్యకుమార్ చేసిన వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చట్ట సవరణ బిల్లు ద్వారా ముస్లిమేతరులను వక్ఫ్‌బోర్డులో సభ్యులుగా చేర్చాలని చూడటం తగదన్నారు. ముస్లింలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి షేక్ జుబేర్ మాట్లాడుతూ బాధ్యతగల పదవిలో ఉండి ముస్లింల మనోభావాలను కించపరిచేలా మాట్లాడిన



జగ్గయ్యపేటలో విలేకరులతో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, మైనార్టీ నాయకులు

మంత్రి సత్యకుమార్‌ను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి వ్యాఖ్యలను సీఎం చంద్రబాబు కూడా ఖండించకపోవడం ఆయన వైఖరిని తెలియజేస్తోందన్నారు. ఇమామ్‌లకు, మౌజన్లకు గౌరవ వేతనాన్ని పెంచుతామని హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు అవసరం తీరిన తరువాత ముస్లింలను మోసం చేసిందని విమర్శించారు. సమావేశంలో పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మైనార్టీ నాయకులు మీరా సాహెబ్, ఇమామ్‌లు జాఫర్, షేక్ అఫ్జల్, మౌలాలీ, జానీ, ఆలీషేక్ పాల్గొన్నారు.

హెడ్‌వాటర్ వర్క్స్‌ను సందర్శించిన ఎస్‌ఈ

సాక్షి ఎఫెక్ట్

జగ్గయ్యపేటఅర్బన్: 'అరకొరగానే కృష్ణా జలాలు' శీర్షికన ఈనెల 20వ తేదీన 'సాక్షి'దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనివాసరావు, ఈఈ స్వామినాయుడు శుక్రవారం జగ్గయ్యపేటలోని హెడ్‌వాటర్ వర్క్స్‌తోపాటు ముక్త్యాల వద్ద కృష్ణానది ఒడ్డున ఉన్న పంప్‌హౌస్‌ను సందర్శించారు. పట్టణానికి నీటిని పంపింగ్ చేసేందుకు కొత్తగా 60హెచ్‌పీ, 40హెచ్‌పీ మోటార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పంప్‌హౌస్‌లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిత్యం పర్యవేక్షిస్తుండాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వారి వెంట పేట మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, డీఈఈ కలీముల్లా, ఏఈ ఇసార్ అహ్మద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



హెడ్‌వాటర్‌వర్క్స్‌లోని పైపులను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనివాసరావు, ఈఈ

సత్యసాయి భక్తుల సేవలు వెలకట్టలేనివి

మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామటౌన్: భగవాన్ సత్యసాయి బోధనల ప్రభావంతో భక్తులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని సత్యసాయి మందిరంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సమాజ హితం కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు వాసుదేవరావు, సరికొండ రవీంద్ర, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

ముమ్మరంగా వరి కోతలు

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం పంట మొత్తం కోత దశకు చేరగా, వాతావరణం రైతులను కలవరపెడుతోంది. తుఫాన్ వచ్చే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో పంట కోత కోయాలా లేదా వాయిదా వేసుకోవాలా? అనే సందిగ్ధంలో పలువురు రైతులు ఉన్నారు. సీజన్‌లో తొలుత వరిసాగు చేపట్టినవారు కోతలు పూర్తిచేసి కల్లాల్లో ధాన్యం కాటాలు కూడా వేస్తున్నారు.

తగ్గిన దిగుబడులు..

ఈఏడాది ఖరీఫ్ సాగు రైతులను దగా చేసింది. తుఫాన్లు వరదల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరదల కారణంగా దెబ్బతిన్న పంట పోను మిగిలిన పంటను కాపాడుకోవటానికి నానా పాట్లు పడ్డారు. ఈఏడాది పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లోని చెరువులు, బావులు, మునేరు ఎత్తిపోతల పథకాల కింద రైతులు సుమారు 5,700 హెక్టార్లలో వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. వరదలకు 1,777 హెక్టార్లలో పంట దెబ్బతింది. ప్రస్తుతం చాలా గ్రామాల్లో వరి కోతకు రాగా, కొన్ని చోట్ల కోతలు కూడా కోస్తున్నారు. ముందుగా వేసిన వారు అయితే కల్లాల్లో ధాన్యం కాటాలు కూడా వేస్తున్నారు. వాతావరణం, వరదలు, చీడపీడలు కారణంగా ఈ ఏడాది వరిలో దిగుబడులు బాగా తగ్గినట్లు రైతులు వాపోతున్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా పలు నిబంధనలు కారణంగా చాలామంది రైతులు కల్లాల్లోనే అయినకాడికి అమ్ముకుంటున్నారు. తుఫాన్ వస్తే



యంత్రం సాయంతో సాగుతున్న వరికోతలు

మరింత నష్టపోతామని తక్కువ ధర వస్తున్నా దళారులకు అమ్మి వెంటనే సొమ్ము చేసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు.

వాతావరణంపై ఆందోళన..

వాతావరణం మారితే నష్టపోవాల్సి వస్తుందని ఆందోళనతో కొంతమంది రైతులు యంత్రాలతో వరి కోతలు పూర్తిచేస్తున్నారు. యంత్రాల ద్వారా ఎకరా వరికోతకు రూ.2వేలు అవుతోంది. యంత్రాల ద్వారా కోతలు, నూర్పుళ్లు తదితర పనులు లేకుండా ఏకంగా యంత్రాలు ధాన్యాన్ని చేతికి అందిస్తున్నాయి. అయితే యంత్రాలతో నూర్పుళ్లు చేస్తే గడ్డికి ఇబ్బంది వస్తుందని కొంతమంది రైతులు కూలీల వైపు కూడా మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం గ్రేడ్–ఏ రకానికి ఒక క్వింటాను రూ.2,320, 75కిలోలకు రూ.1725లకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. సాధారణ రకానికి క్వింటాకు రూ.2,300, 75కిలోలకు రూ.1740 నిర్ణయించింది. అయితే రైతులు మాత్రం కల్లాల్లో దళారులకు ధాన్యం రకాన్ని బట్టి రూ.1500 నుంచి విక్రయిస్తున్నారు.

దిగుబడులు తగ్గాయి..



వరదలతోపాటు పంట చివరిలో వరిని పురుగు ఆశించడంతో దిగుబడులు తగ్గాయి. గతంలో ఎకరానికి 35 బస్తాలు పైగా దిగుబడులు వస్తే ఈఏడాది 26 నుంచి 27 బస్తాలు వస్తున్నాయి. ఇప్పుడే వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈసమయంలో మరోసారి తుఫాన్ వస్తే తీవ్రంగా నష్టపోతాం.

–యనమదల నరసింహారావు, రైతు, పెనుగంచిప్రోలు

దళారులను ఆశ్రయించవద్దు..



పంట చేతికొచ్చే సమయంలో కల్లాల్లోకి వచ్చే దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దు. గుమ్మడిదుర్రు, అనిగండ్లపాడులో సుమారుగా 2వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశాం. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించే రైతులకు త్వరితగతిన నగదును అందజేస్తున్నాం.

–కె.రామసుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, పెనుగంచిప్రోలు

మద్దతు ధర కల్పించాలని డిమాండ్

పెనుగంచిప్రోలు: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని రైతుసంఘ నాయకులు డిమాండ్ చేశారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సంయుక్త కిసాన్‌మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం వారు పెనుగంచిప్రోలులో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రైతు నాయకులు దారా నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ పంటలకు సరైన మద్దతు లభించకపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు ఏర్పడి రైతులు నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నందున పంట రుణాలు మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు ఆత్మహత్యల నివారణకై కేరళ రాష్ట్రంలో మాదిరిగా రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలో నిర్వహించే ధర్నాలో రైతులు, ప్రజలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



కరపత్రాల పంపిణీలో రైతుసంఘ నాయకులు

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

చిల్లకల్లు (జగ్గయ్యపేట): ఇసుక కూపన్ల జారీలో పంచాయతీ కార్యదర్శులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎంపీడీవో నితిన్ ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేదాద్రి, రావిరాల, బూదవాడ, కె.అగ్రహారం, మల్కాపురం గ్రామాల్లో ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక కావలసినవారు సచివాలయాల నుంచి కూపన్లు తీసుకోవాలని సూచించారు. కూపన్‌ల జారీలో సిబ్బంది అప్రమత్తంగా లేకుంటే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో కుక్కల బెడద నివారణకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టేలా చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈవోపీఆర్డీ పద్మావతి, కార్యదర్శులు జగ్గయ్య, శివాజీ, శ్రీనివాసరెడ్డి, శ్రావణ్, సంక్రాంత్, జ్యోతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో నితిన్

ఓటు నమోదుకు ప్రత్యేక డ్రైవ్

నందిగామటౌన్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకునేందుకు శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, అర్హత కలిగిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు.

కాలభైరవుడికి విశేష పూజలు

ముండ్లపాడు క్రాస్‌రోడ్స్(పెనుగంచిప్రోలు): పవిత్ర కార్తికమాస శుక్రవారం సందర్భంగా స్థానిక జాతీయ రహదారిపై ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద నున్న కాలభైరవుడి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నిఖిలేశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా దీపాల అలంకరణ, ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

వీరులపాడు: మండలంలోని దొడ్డదేవరపాడులో కోసూరు పుల్లారావు అనే వ్యక్తి వద్ద 11 తెలంగాణ మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని కంచికచర్ల ఎక్సైజ్ సీఐ అష్రఫునీసా బేగం శుక్రవారం తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అక్రమ మద్యం రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

280 గ్రాముల బంగారం చోరీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని చిల్లకల్లులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన జంగా రమ ఈనెల 18వతేదీన విజయవాడలోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. ఈక్రమంలో గురువారం రాత్రి ఆమె కుమార్తె చిల్లకల్లులోని ఇంటికి వచ్చింది. తలుపులు తెరిచి ఉండటంతోపాటు బీరువా పగులగొట్టి ఉండటాన్ని గమనించింది. బీరువాలోని 280 గ్రాముల బంగారం, కిలో వెండి, రూ.15వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రెండు ఇసుక లారీలు స్వాధీనం

జగ్గయ్యపేట: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను శుక్రవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నట్లు జగ్గయ్యపేట ఎస్‌ఐ బి.రాజు తెలిపారు. పట్టణంలోని షేర్‌మహ్మద్‌పేట అడ్డరోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు ఇసుక క్వారీ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమంగా తరలివెళ్తున్నట్లు గుర్తించి లారీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నల్గొండ జిల్లాకు చెందిన జడ జనార్దన్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అదేవిధంగా గురువారం అర్ధరాత్రి ఆటోనగర్ ఓ ఇసుక లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

జగ్గయ్యపేట: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ భవాని శుక్రవారం సూచించారు. సబ్‌డివిజన్ పరిధిలోని 24 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 52 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

మైలవరం: శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి (అమ్మ భగవాన్ సేవా సమితి) ఆధ్వర్యంలో నిరుపేదలు, పంచాయతీ కార్మికులకు దుప్పట్లు, టవల్స్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. సమితి సభ్యులు మాట్లాడుతూ శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి అధ్వర్యంలో కృతజ్ఞతా భావం దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా దుప్పట్లు పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు. పరంజ్యోతి భగవతి భగవాన్ బోధనలు ఆచరించే ప్రతి ఒక్కరూ ప్రపంచ వ్యాప్తంగా కృతజ్ఞతా దినోత్సవం ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.